ఆధునిక చికిత్సతో క్యాన్సర్‌ను జయించవచ్చు

● మంత్రి శ్రీధర్‌బాబు ● అపోలో ఆస్పత్రిలో విక్టరీ బెల్ ప్రారంభం

విక్టరీ బెల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 3 : క్యాన్సర్‌ను జయించి సాధారణ స్థితికి చేరుకున్న రోగుల విజయానికి సూచికగా జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో 'విక్టరీ బెల్' ఏర్పాటు చేశారు. శనివారం విక్టరీ బెల్‌ను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ రోగులు అధైర్య పడవద్దని, ఆధునిక చికిత్సలతో సాధారణ జీవితం గడపవచ్చునన్నారు. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలో విక్టరీ బెల్ ఆంకాలజీ విభాగంలో జరిగిన పోరాటాలకే కాకుండా ప్రతి క్యాన్సర్ రోగి ప్రయాణాన్ని నిర్వచిస్తుందన్నారు. ప్రతికూల పరిస్థితులపై ప్రబలమైన మానవ స్ఫూర్తికి శక్తివంతమైన నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పి. విజయ్ ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక, జాతి వ్యత్యాసాలు ఉండొద్దు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3 : క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక, జాతి వ్యత్యాసాలు ఉండవద్దని, అందరికీ నాణ్యమైన చికిత్స అందించాలని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ జి. సూర్యనారాయణరాజు అన్నారు. సోమాజిగూడలోని అశ్విని దవాఖానలో శనివారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటని, పేద, మధ్యతరగతి, ధనిక వర్గాలని తేడా లేకుండా అందరూ ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. జీవనశైలిలో మార్పుల ద్వారానే క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చన్నారు. అన్ని వర్గాలకు ఒకే రకమైన నాణ్యమైన చికిత్స అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిందని, ఆ దిశగా తమ ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తామన్నారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నేటి నుంచి ఈనెల 10 వరకు స్క్రీనింగ్‌టెస్ట్‌తోపాటు రోగులకు ప్రత్యేక రాయితీతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సదస్సులో చీఫ్ ఆఫ్ మెడికల్ ఆంకాలజీ డాక్టర్ డి. రఘునాథరావు, గైనిక్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రమణి జీఎస్వీ, మెడికల్ ఆంకాలజిస్ట్‌లు డాక్టర్ నదీమ్ అహ్మద్, డాక్టర్ గుండు నరేశ్, డాక్టర్ జి. విక్రమ్‌కుమార్, డాక్టర్ బాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సూర్యనారాయణరాజు, తదితరులు

బండ్లగూడ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

బండ్లగూడ, ఫిబ్రవరి 3 : బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై 16 మంది కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ తీర్మాన ప్రతిని శనివారం కలెక్టర్ శశాంకకు సమర్పించారు. అవిశ్వాసంపై ఈనెల 16న బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శశాంక ఉత్తర్వులు జారీ చేశారు. అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసును మేయర్ మహేందర్‌గౌడ్‌కు అందజేశామని, సమావేశానికి అవిశ్వాసం పెట్టిన కార్పొరేటర్లంతా తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

కొనసాగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న యూసీడీ, శానిటేషన్ సిబ్బంది

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 3 : జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్నది. యూసీడీ విభాగంలోని ఎస్‌హెచ్‌జీలు, శానిటేషన్ విభాగంలోని ఎస్‌ఎఫ్‌ఏలు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబసభ్యులకు అవగాహన కల్పిస్తూ స్వచ్ఛ ఆటోలకు చెత్తను అందించాలని సూచిస్తున్నారు. చెత్త రోడ్లపైకి చేరకుండా పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు సంయుక్త కార్యాచరణ అమలు చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్ అధికారులు సైతం ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఇంటి యజమాని, దుకాణదారులు తమ ఇల్లు, షాపుల ముందు డబ్బాలు పెట్టుకుని చెత్త అందులో వేయాలని సూచిస్తున్నారు.

'సమాజంలో మహిళా శక్తి గొప్పది'

మహిళా వ్యక్తిత్వ వికాస సమావేశంలో మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త, విరించి ఆస్పత్రి చైర్మన్ కొంపెల్ల మాధవీలత

బండ్లగూడ, ఫిబ్రవరి 3 : సమాజంలో మహిళల శక్తి ఎంతో గొప్పదని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, విరించి ఆస్పత్రి చైర్మన్ కొంపెల్ల మాధవీలత అన్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో మహిళా వ్యక్తిత్వ వికాస సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాధవీలత మాట్లాడుతూ కుటుంబంలో మహిళల పాత్ర గొప్పదని ఒక అమ్మగా, సోదరిగా, కుమార్తెగా, భార్యగా తన ప్రాతను పోషిస్తున్నదన్నారు. భారతీయ సనాతన ధర్మ ఆచారాలను పాటిస్తూ పిల్లలకు చిన్నతనం నుంచే భారతీయతను బోధించి తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నదన్నారు. శ్రీ సరస్వతి విద్యా పీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పీ. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ శిశు మందిరాలు సమాజంలో చక్కటి వ్యవస్థ నిర్మాణం కోసం కృషి చేస్తున్నాయన్నారు. సమావేశంలో విద్యాభారతి దక్షిణ మధ్యక్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వర్‌రావు, సరస్వతి విద్యా పీఠం తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ తిరుపతిరావుతోపాటు అనఘా వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీతారామారావు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 3 : జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో అకడమిక్ కౌన్సిలర్లకు శనివారం యూనివర్సిటీలో ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ప్రొఫెసర్ కె. సీతారామారావు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బోధనా రంగాల్లో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకనుగుణంగా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అకడమిక్ కౌన్సిలర్లు నైపుణ్యాభివృద్ధి పెంచుకోవాలని సూచించారు. ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెకాల్నజీలో ప్రావీణ్యం సాధించడం, బోధనపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా విద్యార్థులకు సరికొత్త పద్ధతులను నేర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ వి. వెంకయ్య, సీఎస్‌టీడీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ. ఆనందపవార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్

శ్యాంసుందర్ పబ్బోజు

మణికొండ, ఫిబ్రవరి 3 : గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న శ్యాంసుందర్ పబ్బోజుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఎఫిషియెంట్ టాస్క్ షెడ్యూలింగ్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ ఎన్విరాన్‌మెంట్ యూసింగ్ మోటాహెరిస్టిక్ అల్గారిథమ్స్' అనే అంశంపై ప్రొఫెసర్ ఆదిలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన శ్యాంసుందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

భీమమ్మ కుటుంబసభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 3 : గౌతమ్‌నగర్‌కు చెందిన భీమమ్మ అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. చికిత్స కోసం భీమమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 2 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని శనివారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి శంకుస్థాపన

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 3 : జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్లలో శనివారం కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా 11 బోర్లు ప్రారంభించడంతోపాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యులు

ఫ్లో సైటోమెట్రీపై వర్క్‌షాప్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 3 : బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'ఫ్లో సైటోమెట్రీ' అనే అంశంపై ఆస్పత్రిలో వర్క్‌షాప్ జరిగింది. బసవతారకం, ఉస్మానియా, నిమ్స్ వైద్య కళాశాలల పాథాలజీ విభాగాధిపతులు డాక్టర్ సునేత్రి, డాక్టర్ రోషిణి పాల్, డాక్టర్ శాంతివీర్ పాల్గొని కేస్ స్టడీస్ రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చెన్నై అడయార్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ కేవీఎన్ రాజు, నిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ కార్తిక్ బొమన్నన్, తదితరులు పాల్గొన్నారు.

జైభీమ్ యాదగిరికి సన్మానం

జైభీమ్ యాదగిరిని సన్మానిస్తున్న సీఐడీఐ ప్రతినిధులు

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 3: డాక్టర్ అంబేద్కర్ భావజాల వ్యాప్తి, ఆశయాల సాధనకు విశేష కృషి చేస్తున్న జైభీమ్ యాదగిరిని సీఐడీఐ(కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ దళిత్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఐడీఐ చైర్మన్ ఎర్రతోట రాజశేఖర్, తెలంగాణ అధ్యక్షుడు నీరుడి రాజు, లక్ష్మణ్, యాదగిరి, తిరుపతయ్య, కురుమయ్య, సంస్థ సభ్యులు యాదగిరికి శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా జైభీమ్ యాదగిరి మాట్లాడుతూ తనకు లభించిన ఈ సన్మానం మరువలేనిదని అన్నారు. దేశవ్యాప్తంగా అంబేద్కర్ పర్యటించిన ప్రదేశాల వివరాలను సేకరించి ఆయా ప్రాంతాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ భావజాల వ్యాప్తికి కృషి చేస్తానన్నారు. కాగా బోరబండ డివిజన్ రాజ్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత జైభీమ్ యాదగిరి ఆ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగానూ సేవలందిస్తున్నారు.

శ్మశానవాటికలను ప్రైవేట్‌పరం చేయొద్దు

మాట్లాడుతున్న శ్రీధర్‌రావు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3 : శ్మశానవాటికలను ప్రైవేట్‌పరం చేయొద్దని గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాల బ్యాగరి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్మశానవాటికలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల తమ వృత్తి దెబ్బతింటున్నదని అన్నారు. కొందరు శ్మశానాలను సైతం కబ్జా చేస్తున్నారని వాపోయారు. మాల బ్యాగరీలకు ప్రభుత్వం గుర్తింపుకార్డుతో పాటు ఆరోగ్యకార్డు, బీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పద్మాకర్, ఉపాధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, కోశాధికారి ఎం. శ్రీనివాసరావు, పి. రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

క్యాన్సర్ రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3 : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, సోషల్ రెస్పాన్సిబులిటీ కమిటీ సంయుక్తాధ్వర్యంలో శనివారం ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో 300 మంది క్యాన్సర్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ మాట్లాడుతూ క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధికారక ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పిస్తే దాని బారిన పడకుండా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తిరుమలరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం.సత్యనారాయణ, ఇ. రామకృష్ణ, విజయానంద్, దీపక్, వలంటీర్లు పాల్గొన్నారు.

బెదిరించి డబ్బు కాజేసిన దొంగ అరెస్టు

నిందితుడు ముఖేశ్‌ను అరెస్టు చేసిన నార్సింగి పోలీసులు

మణికొండ, ఫిబ్రవరి 3 : ఒంటరిగా ఉన్న వ్యక్తిని బెదిరించి అతడి వద్ద నగదు, సెల్‌ఫోన్‌ను దొంగిలించిన దొంగను నార్సింగి పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. బండ్లగూడ జాగిర్ పరిధి స్నేహితాహిల్స్‌లో నివాసం ఉంటున్న సాహిల్ దల్ తన ఇంటి బయట ఉండగా హిమాయత్‌సాగర్ గ్రామానికి చెందిన గురుగుర్తి ముఖేశ్ సాహిల్ దగ్గరకు వచ్చి బెదిరించి అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ. 20 వేల నగదును లాక్కుని పారిపోయాడు. దీంతో బాధితుడు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, క్రైం బృందం నిందితుడు ముఖేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నగదు, సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగించిన పోలీసులు నిందితుడిపై అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువతి అదృశ్యం

కందూరి కృష్ణవేణి(ఫైల్)

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3 : ఇంటి నుంచి పని కోసం బయటకు వెళ్లి ఓ యువతి అదృశ్యమైంది. ఖైరతాబాద్ ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్‌లోని డబుల్ బెడ్రూం భవన సముదాయంలో కందూరి కృష్ణవేణి (23) కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నది. కుమ్మరిబస్తీలో ఓ ఇంట్లో పని చేస్తూ రోజూ ఉదయం పదింటికి వెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి తిరిగి వస్తుంది. శుక్రవారం పనికి వెళ్లిన కృష్ణవేణి తిరిగి ఇంటికి రాలేదు. దాంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. మహబూబ్‌నగర్‌లోని బంధువైన యువకుడితో ఆమె తరచూ మాట్లాడేదని, అక్కడికి ఫోన్ చేసినా సరైన సమాధానం లేదని యువతి బంధువు జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అధికారులే బాలుడి చావుకు బాధ్యత వహించాలి'

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : శంషాబాద్ మున్సిపాలిటీ సమ ఎన్‌క్లేవ్‌లో వీధి కుక్కల దాడిలో ఏడాది బాలుడు నాగరాజు మృతిచెందిన ఘటనకు మున్సిపల్‌శాఖ అధికారులే బాధ్యత వహించాలని జాతీయ మానవ హక్కుల ప్రచారకర్త యూత్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఇమ్రాన్, కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గత కొన్నాళ్లుగా శంషాబాద్ మున్సిపాలిటీలో వీధి కుక్కల స్వైరవిహారం కొనసాగుతుందని స్థానికులు ఫిర్యాదు చేసినా మున్సిపల్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రాణాలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం శంషాబాద్‌లోని సమ ఎన్‌క్లేవ్ వద్ద బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఘటనకు మున్సిపల్‌శాఖ బాధ్యత వహిస్తూ బాలుడి కుటుంబానికి రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంచిరేవులలో మల్లన్న, బీరప్ప జాతర

మణికొండ, ఫిబ్రవరి 3 : నార్సింగి మున్సిపాలిటీ పరిధి మంచిరేవుల గ్రామంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు మల్లన్న, బీరప్ప, ఎల్లమ్మ కల్యాణోత్సవాలు, బోనాల ఊరేగింపు జరుగుతుందని కురుమ సంఘం మండల వైస్ చైర్మన్ దొబ్బ భాస్కర్ కురుమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి యేటా గొల్ల,కురుమలు కలిసి నిర్వహించే ఈ జాతరను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని వైస్ చైర్మన్ కోరారు.

'అక్రమ వెంచర్లపై విచారణ జరిపించండి'

మాట్లాడుతున్న ప్రశాంత్ రివిక

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 3: కడ్తాల్ మండలం హనుమాస్‌పల్లి వద్ద వెలిసిన అక్రమ వెంచర్లపై సమగ్ర విచారణ నిర్వహించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్(ఎన్‌హెచ్‌ఆర్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రశాంత్ రివిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ నిర్వాహకులు అక్రమంగా వెంచర్లు చేసి పేదల వద్ద అందినకాడికి దండుకుంటూ వందల కోట్ల కుంభకోణానికి పాల్పడుతు న్నారని ఆరోపించారు. పదేండ్ల క్రితం అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి మౌలిక వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ వెంచర్లకు ఎలాంటి అనుమతులు లేవని తమ విచారణలో తెలిందన్నారు. పేదలు నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం అక్రమ వెంచర్లపై విచారణ జరిపించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఎన్‌హెచ్‌ఆర్ రంగారెడ్డి జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు దినేశ్‌కుమార్, న్యాయ సలహాదారులు దీప్తినాగేందర్, పి.శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

పెద్దషాపూర్ గ్రామ పాలకవర్గానికి సన్మానం

పెద్దషాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని సన్మానించిన గ్రామస్తులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : పెద్దషాపూర్ గ్రామ పాలకవర్గం సేవలు నిరంతరం కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో శనివారం పెద్దషాపూర్ పంచాయతీ సర్పంచ్ చంద్రశేఖర్, వార్డుసభ్యులను ప్రజలు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ మరింత ఉత్సాహంగా సేవలందించాలని కోరారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేసిన సర్పంచ్ చంద్రశేఖర్ ముదిరాజ్ సేవలను తాము గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ గౌస్ పాషా, పంచాయతీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, బిల్ కలెక్టర్ రాజిరెడ్డి, కులసంఘాల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

విదేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో విద్యావకాశాలు కల్పించేందుకు ఐవీవై ఓవర్సీస్ ఆధ్వర్యంలో శనివారం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్‌దక్కన్‌లో నిర్వహించిన ఈ ఉచిత అవగాహన సదస్సును సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు గిరి శ్రీనివాసరావు, రామ్ బొంగరాల ప్రారంభించారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరై విదేశీ విద్యపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. *–బంజారాహిల్స్, ఫిబ్రవరి 3*

సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్‌లో డైరీ ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాంచందర్, తదితరులు

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 3: రాష్ట్రంలోని సైకాలజిస్టుల సంక్షేమం కోసం కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్టుల అసోసయేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ ఎన్ రెడ్డి భవన్‌లో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ రాంచందర్ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు సైకాలజిస్టుల సేవలు ఎంతో అవసరమని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, నాయకులు డాక్టర్ శ్రీపూజ, వైదేహి, విజిత, అనిత పాల్గొన్నారు.

సాయిబాబానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు షురూ..

సాయిబాబానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 3 : బోరబండ డివిజన్ సాయిబాబానగర్ బస్తీలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గతంలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ పనులను శనివారం జలమండలి అధికారులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేశ్‌నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాగంటి చొరవతో కేవలం 5 ఏండ్లలో సాయిబాబానగర్ రూపురేఖలు మారిపోయాయన్నారు. అంతర్గత సీసీ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ల విస్తరణ, ఆధునిక విద్యుద్దీపాలు, డ్రైనేజీ పైప్‌లైన్ తదితర పనులకు నిధులను మంజూరు చేయించిన మాగంటికి బస్తీ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో సురేశ్ పంతులు, నవీన్‌నాయక్, నాగిరెడ్డి, తిరుపతిరావు, గోపాల్, జేసీబీ రాజు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ సంగీత, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ

వెంగళరావునగర్, ఫిబ్రవరి 3 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్ యాదవ్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. శనివారం శ్రీనగర్‌కాలనీ డివిజన్‌లోని వడ్డెర బస్తీలో పారిశుధ్య సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టి కుప్పలు, వ్యర్థాలను తొలగించే పనుల్ని ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వారికి సూచించారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలకు హెల్మెట్.. జీవితానికి భద్రత

చిన్నారులకు హెల్మెట్‌లను అందజేస్తున్న ఏసీపీలు శంకర్‌రాజు, రత్నం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3: తలకు హెల్మెట్ ధరిస్తే.. అది వారి జీవితానికి భద్రత కల్పిస్తుందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి. శంకర్‌రాజు అన్నారు. రోడ్ ట్రాక్స్ క్లబ్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఇండియన్ హెడ్ ఇంజ్యూరీ ఫౌండేషన్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, హీరో మోటార్స్ సహకారంతో ఖైరతాబాద్‌లోని సరస్వతి విద్యామందిర్, నిర్మల హైస్కూల్‌లో శనివారం 'రోడ్డు ప్రమాదాలు, నివారణ' అనే అంశంపై విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ సెల్‌ఫోన్ పగిలిపోకుండా స్క్రీన్‌గార్డ్ వేసుకుంటున్నట్లు తలకు దెబ్బతగలకుండా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతోపాటు యువతీ, యువకులకు ఏసీపీలు శంకర్‌రాజు, ఎన్బీ రత్నం, సీఐ రాజశేఖర్ ఉచితంగా హెల్మెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పాయల్ కన్నా, ఎన్. కిషన్, జగదీశ్, సోమలింగం, నిర్మల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. మధు, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న, సలహాదారులు సుబ్బలక్ష్మి, గోవిందన్, మేరీ, ఆరాధన జైన్ పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడలో ఆస్తిపన్ను స్పెషల్ డ్రైవ్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 3 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆస్తిపన్ను వసూలు ముమ్మరం చేశారు. మొండి బకాయిదారుల నుంచి పన్ను వసూలు చేసేందుకు ప్రాపర్టీ ట్యాక్స్ డ్రైవ్ చేపట్టారు. శనివారం ఏఎంసీ కమల్, ఇన్‌చార్జి ఏఎంసీ బాల్‌రాజ్‌తో పాటు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పలువురి నుంచి ఆస్తిపన్ను వసూలు చేశారు. ఇందులో భాగంగా అధికారులు సకాలంలో పన్ను చెల్లించని వారికి అపరాధ రుసుము విధించడం.. మొండి బకాయిదారులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటున్నారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ సూచించారు.